ప్రజా విశ్వంభర V3 NEWS లక్ష్యం సమాజహితం

"మా భగవతి విశాల్ జాగరణ్" ఒక శక్తివంతమైన ఆధ్యాత్మిక సాధన

- డిజిపి, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: "మా భగవతి విశాల్ జాగరణ్" ఒక శక్తివంతమైన ఆధ్యాత్మిక సాధనం అని, ఇది భక్తులు దివ్యమాతతో అనుసంధానం కావడానికి, ఆధ్యాత్మిక ఎదుగుదలను పొందడానికి సహాయపడుతుందని, దేవత పట్ల భక్తిని మరియు కృతజ్ఞతను వ్యక్తపరచడానికి, శాంతియుత, సంపన్నమైన జీవితం కోసం ఆమె ఆశీర్వాదం కోరడానికి ఒక మార్గమని తెలంగాణ డిజిపి, డైరెక్టర్ తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో శిఖా గోయల్ తెలిపారు. సనాతన సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా, దైవిక రక్షణ, కుటుంబాల ఆశీర్వాదం కోసం ప్రేమ, కరుణ, భక్తి, ధర్మం వంటి విలువలను పెంపొందించేందుకు హైదరాబాద్, నాంపల్లి, ఎక్షిబిషన్ గ్రౌండ్స్ లో శనివారం రాత్రి నుండి ఆదివారం ఉదయం వరకు మా వైష్ణో దేవి మాతా జాగరణ్ మండల్ హైదరాబాద్ మా వైష్ణో దేవి మాత కు అంకితం చేస్తూ "మా భగవతి విశాల్ జాగరణ్" ను అత్యంత వైభవంగా నిర్వహించింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శిఖా గోయల్ పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, మాట్లాడుతూ జాగరణ్ ప్రశాంతమైన వాతావరణాన్ని సృష్టించి, మనస్సును మరియు ఆత్మను శుద్ధి చేస్తుందిని అన్నారు. మా వైష్ణో దేవి మాతా జాగరణ్ మండల్ హైదరాబాద్ కోర్ కమిటీ సభ్యులు రామ్ కిషన్ అగర్వాల్, అంజనీ కుమార్ అగర్వాల్, రాకేష్ నర్సింగ్‌పురియా, సంజయ్ అగర్వాల్, ధీరజ్ అగర్వాల్, మనీష్ అగర్వాల్, పురుషోత్తం అగర్వాల్, ముఖేష్ అగర్వాల్, రాకేష్ జలాన్, ,సూర్యకమల్ జి పుత్రా, అంజనీ కుమార్ సరోగి, ల నేతృత్వంలో జరిగిన ఈ "మా భగవతి విశాల్ జాగరణ్" ను జమ్మూ కాట్రా లోని మాత వైష్ణవ దేవి మందిర్ పూజారి లోకేష్ జి మహారాజ్ ప్రత్యేక పూజలు జరిపి ప్రారంభించారు. వేలాదిమంది భక్తులు పాల్గొని తల్లి భగవతి ఆస్థానంలో అఖండ జ్యోతి, మహాసభ, అతీంద్రియ దర్శనం, భజన గంగా, మాత నిధి, తారా రాణి కథ, ఆర్తి, మహా ప్రసాదం, ఖజానా వంటివి స్వీకరించారు. జోధ్‌పూర్ కు చెందిన ప్రముఖ జాతీయవాద గాయకుడు ఛోటూ సింగ్ రావ్నా న్యూఢిల్లీ కు చెందిన ప్రముఖ భజన గాయకుడు సుమిత్ సైని, హైదరాబాద్‌కు చెందిన గాయకుడూ భజన సామ్రాట్ మురారి దహిమా ఉత్సాహభరితమైన భక్తి వాతావరణంలో మాతా భగవతి ని స్తుతిస్తూ పాడిన భజనలు మరియు కీర్తనలు భక్తులను ఆధ్యాత్మిక అనుభూతిలో ముంచ్చేతాయి. ఈ కార్యక్రమంలో జాంబాగ్ మాజీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్, రాజస్థాన్ ప్రగతి సమాజ్ ప్రధాన కార్యదర్శి గోవింద్ నారాయణ్ రాతి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు కరోడీమల్ నర్సింగపూరియా తదితరులు పాల్గొన్నారు.

ఇక కాంగ్రెస్‌లో కొనసాగలేను.. ఆరోజే రాజీనామా చేస్తా: జీవన్ రెడ్డి

విశ్వంభర, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి దశాబ్దాలుగా వెన్నెముకలా ఉన్న సీనియర్ నేత, మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. గత కొంత కాలంగా పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆయన, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఈనెల 25న తన పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయబోతున్నట్లు ఆదివారం అధికారికంగా ప్రకటించారు. జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం జగిత్యాలలోని ఆయన నివాసానికి వెళ్లి గంటకు పైగా చర్చలు జరిపారు. పార్టీ వీడవద్దని, హైకమాండ్ ద్వారా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే, జీవన్ రెడ్డి మాత్రం తన నిర్ణయంపై వెనక్కి తగ్గలేదు. 'ఆత్మాభిమానం చంపుకొని, అవమానాలు భరిస్తూ పార్టీలో కొనసాగలేను. మీకో దండం.. మీ పార్టీకో దండం. పార్టీలో గౌరవం లేని చోట ఉండటం కంటే బయటకు రావడమే మంచిదని నిర్ణయించుకున్నాను.' అని మంత్రులకు జీవన్ రెడ్డి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ నుంచి వచ్చిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు పార్టీలో,ప్రభుత్వంలో అధిక ప్రాధాన్యత ఇవ్వడంపై జీవన్ రెడ్డి గుర్రుగా ఉన్నారు. గత 20 నెలలుగా తన అనుచరులు, కార్యకర్తలు పార్టీలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధిష్ఠానం పట్టించుకోలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 40 ఏళ్లుగా పార్టీని నమ్ముకున్న తనకు కనీస గౌరవం దక్కడం లేదని ఆయన మనస్తాపం చెందారు. రాజీనామా అనంతరం జీవన్ రెడ్డి తన భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించనున్నారు. మరోవైపు ఆయన త్వరలోనే మాజీ సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరతారని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే జగిత్యాలలోని ఆయన నివాసం వద్ద కాంగ్రెస్ జెండాలు, ఫ్లెక్సీలను అనుచరులు తొలగించడం గమనార్హం.

కాంగ్రెస్‌ది అభివృద్ధి కాదు..

అంతా అవినీతే : బీజేపీ చీఫ్ రామచంద్రరావు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకం కాదని తెలంగాణ బీజేపీ చీఫ్ రామచంద్రరావు స్పష్టం చేశారు. కానీ.. పేదల ఇళ్లను కూలగొట్టడాన్ని ఎప్పుడూ వ్యతిరేకిస్తూనే ఉంటామని తెలిపారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అనంతరం రామచంద్రరావు మాట్లాడుతూ.. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం రూ.7000 కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేయడమే కాకుండా.. పేదల ఇళ్లను కూలగొట్టడం సరికాదన్నారు. దీనిని ఎప్పటికీ వ్యతిరేకిస్తూనే ఉంటామన్నారు. మూసీ పక్కన ఉన్న అక్రమ కట్టడాలపై మాత్రం ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. పేదల పక్షాన ఎవరూ లేరని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. హైదరాబాద్ నగరం సుందరీకరణ కావాలి కానీ.. అది పేదల ఇళ్లను, వారి జీవితాలను దెబ్బతీసేలా ఉండకూడదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి ఏమీ ఉండదని, అంతా అవినీతే కనిపిస్తోందన్నారు. కేసీఆర్ రూ.లక్షన్నర కోట్లతో కాళేశ్వరాన్ని నిర్మిస్తే.. రేవంత్ రెడ్డి దానిని మూసేశ్వరంగా మారుస్తున్నారని విమర్శించారు. చివరికి తెలంగాణను అభివృద్ధి చెందకుండా మూసేస్తారని దుయ్యబట్టారు. ఇక ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్లో ఇరిగేషన్ రంగ నిపుణులు వెదిరె శ్రీరామ్ ప్రజల ఇళ్ల కూల్చివేతలపై కొన్ని ప్రత్యామ్నాయాలను వివరించారు. మూసీనదిలో కాలుష్యం, డ్రైనేజీ వ్యర్థాలు కలవకుండా శుద్ధిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మూసీనీటి నుంచి రైతులు స్వచ్ఛమైన పంటలను పండించినపుడు మూసీ పునరుజ్జీవం సక్సెస్ అయినట్లుగా భావించాలన్నారు. సిటీ ఏరియాలో మాత్రమే శుద్ధి చేస్తే పైనుంచి వచ్చే సీవరేజ్ అంతా ఎక్కడికి పోతుందన్న ఆలోచన లేకుండా ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు.

శిరందాస్ శ్రీనివాస్‌కు జీవిత సాఫల్య పురస్కారం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: రోగ నిర్ధారణలో ఆధుని క సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఎన్నో అధునాతన యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయని, రోగ నిర్ధారణ ఖచ్చితత్వం, వేగం పెరగడం వల్ల రోగికి అతి త్వరలో వైద్య చికిత్స అందుతుందని నిమ్స్ డైరెక్టర్ డా.నగరి బీరప్ప అన్నారు. పద్మశ్రీ ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు జాతీయ సదస్సు నిమ్స్ ట్రామా ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నిమ్స్ దేశంలోనే స్టేట్ ఆఫ్ ఆర్ట్ యంత్ర పరికరాలతో అత్యున్నత సేవలు అందిస్తుందని తెలిపారు. సంస్థలో రేడియాలజీలో డిజిటల్ ఎక్స్ రే మెషీన్లు, మల్టీ డిటెక్టర్ సిటీ, ఎంఆర్ఐ, మామోగ్రఫీ, డెక్సా స్కాన్, సీఆర్ములు, ఆల్ట్రా సౌండ్ మెషీన్లు, అధునాతన డీఎస్ఏ లాబ్ అందుబాటులో ఉన్నాయన్నారు. హైదరాబాద్‌లో నాలుగు తెలంగాణ ప్రభుత్వ వైద్య విద్యా సంస్థలు ఏర్పాటుతో 4000 బెడ్స్ అందుబాటులోకి రానున్నాయి. నిమ్స్‌లో అదనంగా 2000 బెడ్స్, ఉస్మానియా, కాకతీయ ఆసుపత్రుల్లో మరో 3000 బెడ్స్ తో వైద్య అనుబంధ ప్రొఫెషనల్స్‌కి ఎన్నో ఉద్యోగాలు రానున్నాయని అభిప్రాయపడ్డారు. కాకర్ల సుబ్బారావు తెలుగు రాష్ట్రాల్లో ఆధునిక వైద్య విధానాన్ని, ప్రభుత్వ రంగంలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను విస్తరించడానికి ఆయన చేసిన కృషి అమోఘం, ఆయన కృషిని సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ తెలంగాణ చాప్టర్ ముందుకు తీసుకెళ్తుందన్నారు. కాకర్ల శత జయంతి సందర్భంగా జీవిత సాఫల్య అవార్డును నిమ్స్ వైద్య అనుబంధ వృత్తి విజ్ఞాన కళాశాల ప్రిన్సిపాల్, రేడియాలజీ ఇమేజింగ్/థెరప్యూటిక్ ప్రొఫెషనల్స్ జాతీయ మండలి అధ్యక్షుడు శిరందాస్ శ్రీనివాస్ కి అవార్డును ప్రకటించడం గర్వకారణం అన్నారు. శ్రీనివాస్ ఆ అవార్డుకు అన్ని విధాలా అర్హుడని పేర్కొన్నారు.

ప్రస్తుతం రేడియాలజీ విభాగం ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకొని రోగ నిర్ధారణలో కీలక భూమిక పోషిస్తుందని రేడియాలజీ విభాగం అధిపతి డా.ఎస్.రామ్మూర్తి చెప్పారు. వివిధ రకాల యంత్ర పరికరాలు వాటిని రోగ నిర్ధారణకు ఉపయోగించడానికి సాంకేతిక నిపుణులు ఎప్పటికప్పుడు వారు అప్డేట్ కావడానికి ఇలాంటి సదస్సులు ఉపయోగపడతాయని, అందుకు కృషి చేస్తున్న సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ కృషి అభినందనీయమన్నారు. అందులో కీలక భూమిక పోషిస్తున్న శ్రీనివాస్, దామోదర నాయుడు కృషి అభినందనీయమన్నారు. కాకర్ల సుబ్బారావు రేడియాలజీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతినిధి డా.ఎన్.కవితారెడ్డి మాట్లాడుతూ.. శ్రీనివాస్ ఈ అవార్డుకు అన్ని విధాల అర్హుడు అని, గత ముప్పై ఏండ్లుగా ఆయన కృషికి ఇది గుర్తింపుగా కొనియాడారు. సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ జాతీయ అధ్యక్షులు శంకర్ కె భగత్ మాట్లాడుతూ.. జాతీయ కౌన్సిల్ ఏర్పాటుకు తాము గత నలభై ఏండ్లుగా పోరాడుతున్నామన్నారు. నలభై ఏండ్ల జాతీయ కమిషన్ కల నేడు నెరవేరడమే కాకుండా రేడియాలజీ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడిగా తమ సంస్థ సీఈఓ శిరందాస్ శ్రీనివాస్ ను కేంద్ర ప్రభుత్వం నియమించడం గర్వకారణంగా చెప్పారు. కార్యక్రమంలో సర్ చైర్మన్ కే మునిరత్నం, అకడమిక్ డైరెక్టర్, కె ఎస్ఆర్ జాతీయ సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ కే. దామోదర నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎం.ఏ. వారిస్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మహేష్ బసవేని పాల్గొన్నారు. సదస్సులో దేశం నలు మూలల నుంచి మూడు వందల మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఉత్తమ పరిశోధన పత్రం అవార్డును శ్రీ రామచంద్ర ఇన్స్టిట్యూట్ అఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ కు చెందిన విద్యార్థి చెరుకూరి ధనుష్ అందుకున్నారు. ఈ అవార్డ్ కింద నగదు, ప్రశంసా పత్రం ఇవ్వడం జరిగినది.

నామరూపాలు లేకుండా చేస్తాం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసమని.. రాష్ట్రంలో ఆ పార్టీ బరితెగించిందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఆదివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. బీసీ వర్గాలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడం తప్ప చేసిందదేమీ లేదన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీల ఓట్లతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. అయినప్పటికీ బడ్జెట్‌లో వృత్తి కులాలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. బీసీల్లో ఎక్కువ మంది వృత్తి కులాలపై ఆధారపడి బతుకుతున్నారని తెలిపారు. ఏటా బీసీలకు 20 వేల కోట్ల బడ్జెట్ అన్నారని.. ఇప్పటివరకు రూ.5 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని ఆరోపించారు. ముదిరాజ్‌లను బీసీ ఏలో చేరుస్తామని చెప్పారని.. ఇప్పటివరకు ఏమైందో తెలియదన్నారు. బీసీలకు ఆత్మ గౌరవ భవనాలకు రూ.10 వేల కోట్ల విలువైన స్థలాలు కేసీఆర్ కేటాయించారని తెలిపారు. ఈ ప్రభుత్వంలో విద్య, ఉద్యోగాల్లో బీసీల ప్రస్తావన లేదని.. ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, నిధుల ఊసే లేకుండా పోయిందని అన్నారు. బీసీలకు కనీసం నామినేటెడ్ పదవులు సైతం ఇవ్వడం లేదన్నారు. బీసీ సబ్ ప్లాన్ ఎక్కడికి పోయిందని నిలదీశారు. ప్రజలను నట్టేట ముంచడంలో కాంగ్రెస్ పార్టీ దేశానికి రోల్ మోడల్ అని విమర్శించారు. ఫ్యూచర్ సిటీ, మూసీ ప్రక్షాళనలు ఎవరికి కావాలని.. వీటితో బీసీలకు న్యాయం జరుగుతుందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని బీసీ సమాజం క్షమించదని.. భవిష్యత్తులో నామరూపాలు లేకుండా చేస్తారని హెచ్చరించారు.

పశ్చిమ బెంగాల్‌లో పోటీ చేస్తాం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఆల్ ఇండియా మజ్లిస్ఇఇత్తెహాదుల్ ముస్లిమీన్ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ మాజీ నేత హుమాయున్ కబీర్ స్థాపించిన పార్టీతో జతకట్టాలని నిర్ణయించుకుంది. ఈ విషయాన్ని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్వయంగా ధృవీకరించారు. ముర్షిదాబాద్ మరియు మాల్దా వంటి ముస్లిం జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఈ పొత్తు కీలకంగా మారనుంది. హుమాయున్ కబీర్ ఆ ప్రాంతాల్లో మంచి పట్టున్న నేతగా గుర్తింపు పొందారు. వీరిద్దరూ కలవడం వల్ల రాష్ట్రంలోని మైనారిటీ ఓట్ల చీలిక ఖాయమని, ఇది అటు తృణమూల్ కాంగ్రెస్ కి, ఇటు బీజేపీకి కూడా సవాలుగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పొత్తుపై ఒవైసీ మాట్లాడుతూ.. "పశ్చిమ బెంగాల్‌లో బలమైన మూడో ప్రత్యామ్నాయాన్ని నిర్మించడమే మా లక్ష్యం. హుమాయున్ కబీర్‌తో కలిసి పనిచేయడం వల్ల మైనారిటీల గళాన్ని అసెంబ్లీలో మరింత బలంగా వినిపించగలం" అని ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఒవైసీ బెంగాల్ రాజకీయాల్లో ఆశించిన ఫలితాలు సాధించలేకపోయారు, కానీ ఈసారి స్థానిక నేతలతో పొత్తు పెట్టుకోవడం ద్వారా సత్తా చాటాలని చూస్తున్నారు. తృణమూల్ కాంగ్రెస్ మరియు కాంగ్రెస్ పార్టీలలో పనిచేసిన అనుభవం ఉన్న హుమాయున్ కబీర్, మమతా బెనర్జీ ప్రభుత్వంలో మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. అయితే కొన్ని విభేదాల కారణంగా టీఎంసీకి దూరమై సొంత కుంపటి పెట్టుకున్నారు. ఇప్పుడు ఒవైసీతో జతకట్టడం ద్వారా బెంగాల్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాలని ఆయన భావిస్తున్నారు.

లక్ష్మీపురం స్కూల్ పనుల్లో వేగం పెంచండి.. డిప్యూటీ సీఎం ఆదేశం

విశ్వంభర, బోనకల్ : విద్యకు ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరోసారి స్పష్టం చేశారు. విద్య కోసం పెట్టే ప్రతి రూపాయి భవిష్యత్ తరాలను నిర్మించడం కోసం పెట్టే పెట్టుబడిగా ఆయన అభివర్ణించారు. ఆదివారం మధిర నియోజకవర్గంలో పర్యటించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బోనకల్లు మండలం లక్ష్మీపురం గ్రామంలో నిర్మాణం అవుతున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. నిర్మాణ దశలో ఉన్న భవన సముదాయాలను కలియతిరుగుతూ ఆయన పరిశీలన చేశారు. నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను, గుత్తేదారులను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. ఈ సందర్భంగా జూనియర్ హాస్టల్, జూనియర్, సీనియర్, అడ్మినిస్ట్రేటివ్ భవనాల నిర్మాణాన్ని పరిశీలించారు. అంతేకాకుండా మెకానికల్, సైన్స్, మ్యాథమెటిక్స్ , కంప్యూటర్ ల్యాబ్ భవనాల నిర్మాణాలను పరిశీలన చేశారు. నాణ్యతలో ఎక్కడా రాజీ పడవద్దు అని ఆయన చెప్పారు. ఇవి కేవలం భవనాలు కాదు రేపటి తరాలను ఉజ్వలంగా నిర్మించే దార్శనిక దేవాలయాలుగా అభివర్ణించారు.

త్వరలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ జిల్లాల పర్యటనలు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా బలోపేతం అయ్యేందుకు అనేక నియామకాలను చేపట్టింది. డీసీసీ అధ్యక్షుల నియామకానికి సంఘటన్ శ్రీజన్ అభియాన్ పేరుతో ఏఐసీసీ ఈ నియామకాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. రెండు జిల్లాలు మినహా తెలంగాణలోని అన్ని జిల్లాల అధ్యక్షుల నియామకాన్నిక ఏఐసీసీ చేపట్టింది. ఈ జిల్లా అధ్యక్షులకు ఇటీవలే పది రోజుల పాటు వికారాబాద్ లో శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టింది. ముగింపు కార్యక్రమానికి లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరై వారితో దాదాపుగా 4గంటల సేపు గడిపారు. దీనితో పాటు పెండింగ్ లో ఉన్న డీసీసీ కార్యవర్గాల్లో పదవులు భర్తీని ఇటీవలనే టీపీసీసీ చేటపట్టింది. 14 జిల్లాలకు కార్యవర్గాన్ని కూడా టీపీసీసీ ప్రకటించింది. గ్రామ పంచాయితీ, మున్సిపల్ ఎన్నికలు ముగియడంతో రానున్న రోజుల్లో జెడ్పీ ఎన్నికలను ప్రభుత్వం నిర్వహించాల్సి ఉంది. దీని కోసం ఇప్పటి నుంచే టీపీసీసీ చీఫ్‌సమాయత్తమవుతున్నారు. జిల్లాల పర్యటనలకు మహేష్ కుమార్ గౌడ్ శ్రీకారం చుట్టారు. జిల్లాల్లో పర్యటనల్లో భాగంగా ఆదివారం ఆయన యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యర్యంలో నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతనంగా నియమితులైన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు ఫలితం తప్పక ఉంటుందని, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి చేర వేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని, అధికారంలో ఉన్నా లేకపోయినా పార్టీనే శాశ్వతమని మహేష్ కుమార్ గౌడ్ పార్టీ శ్రేణులకు దిశా నిర్ధేశం చేశారు. ముఖ్యంగా జిల్లాల పర్యటనల ద్వారా టీపీసీసీ చీఫ్‌పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడంతో పాటు, ప్రభుత్వ పథకాలు ప్రజలకు సమగ్రంగా చేరేలా పార్టీ శ్రేణులకు ఆయన దిశా నిర్ధేశం చేయనున్నారు. ప్రతి జిల్లాలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ, స్థానిక సమస్యలు, పార్టీ పరిస్థితులపై మహేష్ కుమార్ గౌడ్ సమీక్షలు చేయనున్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేసి, భవిష్యత్ ఎన్నికల దిశగా పటిష్ట కార్యాచరణ రూపొందించడమే లక్ష్యంగా ఈ పర్యటనలు కొనసాగుతాయని పార్టీ వర్గాలు చెప్పాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలకు ఆయన రూపొందించనున్నారు. ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించడం ద్వారా పార్టీపై విశ్వాసాన్ని మరింత పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు. జిల్లాల పర్యటనల ద్వారా పార్టీకి కొత్త ఉత్సాహం వస్తుందని, కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందన్న ఆశాభావాన్ని హస్తం శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి.

ఉప సర్పంచ్ ల సంఘం జిల్లా అధ్యక్షునిగా అంజి యాదవ్

విశ్వంభర, నాగారం : ఉప సర్పంచుల సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులుగా తుంగతుర్తి నియోజకవర్గం నాగారం మండలం నాగారం గ్రామ ఉప సర్పంచ్ వంగూరి అంజి యాదవ్ ను.ఆదివారం హైద్రాబాద్ లో జరిగిన ఉపసర్పంచుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో వంగూరి అంజి యాదవ్ ను నియమిస్తూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు లావుడ్య రాములు నాయక్ నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అంజి యాదవ్ మాట్లాడుతూ నా పై నమ్మకంతో నన్ను జిల్లా అధ్యక్షునిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు రాములు నాయక్ కు ప్రత్యేకధన్యవాదాలు తెలిపారు.జిల్లాలో ఉప సర్పంచుల సమస్యల పరిష్కరించడానికి పాటుపడతానని,ఉప సర్పంచుల సంఘం సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని అని అన్నారు.

మూసీ నది పునరుజ్జీవనం ప్రణాళికలో శాస్త్రీయత లేదు : వెదిరె శ్రీరామ్

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : మూసీ నది పునరుజ్జీవనం పేరుతో రేవంత్‌ప్రభుత్వం చేపడుతున్న ప్రణాళికల్లో ఎక్కడ శాస్త్రీయ దృష్టికోణం కనిపించడం లేదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు, కేంద్ర జల వనరుల శాఖ మాజీ సలహాదారు వెదిరె శ్రీరామ్ పేర్కొన్నారు. రివర్ రిజువినేషన్ అంటే నదిని ఒక జీవ వ్యవస్థగా పునరుద్ధరించడం కాగా, రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ అంటే కేవలం సుందరీకరణ మాత్రమేనని చెప్పారు. ఆదివారం మూసీ నది పునరుజ్జీవనం వాస్తవాలు అంశంపై బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చా కార్యక్రమంలో పాల్గొని మూసీ నది పునరుద్ధరణపై సాంకేతిక విశ్లేషణ చేస్తూ కీలక ప్రసంగం చేశారు. జీవం లేని నదిపై కేవలం అలంకరణ చేయడంతో ప్రయోజనం ఉండదని, ముందుగా నది ఆరోగ్యాన్ని పునరుద్ధరించడం అత్యవసరమని స్పష్టం చేశారు. నదిలో చేపలు జీవించగలగడం, నీటి నాణ్యత మెరుగుపడడం వంటి సూచికల ద్వారా మాత్రమే పునరుజ్జీవనం సాధ్యమవుతుందని తెలిపారు. నది అంటే కేవలం పైన ప్రవహించే నీరు మాత్రమే కాదు, భూమి కింద ఉన్న పాలియో ఛానల్స్, భూగర్భ జలాలు, సెడిమెంట్ ప్రవాహం, సీజనల్ మార్పులు, రైపేరియన్ జోన్ వంటి అంశాల సమగ్ర వ్యవస్థ అన్నారు. నీరుభూమి కలిసే ప్రాంతమైన రైపేరియన్ జోన్ నది ఆరోగ్యానికి అత్యంత కీలకమని, అక్కడ ఫిల్ట్రేషన్, జీవవైవిధ్యం, హ్యాబిటాట్ సపోర్ట్ జరుగుతుందని చెప్పారు. ఈ సహజ వ్యవస్థలను విస్మరించి కాంక్రీట్ నిర్మాణాలపై మాత్రమే దృష్టి పెట్టడం నది జీవ వ్యవస్థకు హానికరమని హెచ్చరించారు. ఈ ప్రాంతంలో క్యాచ్‌మెంట్ ఏరియా ట్రీట్మెంట్ పూర్తిగా నిర్లక్ష్యం చేయబడిందని, చిన్న వాగులు, ఫస్ట్ ఆర్డర్, సెకండ్ ఆర్డర్, థర్డ్ ఆర్డర్ స్ట్రీమ్స్ పునరుద్ధరించకుండా ప్రధాన నది పునరుజ్జీవనం అసాధ్యమని పేర్కొన్నారు. రిడ్జ్ టు వ్యాలీ విధానంలో చెక్ డ్యామ్‌లు, కంటిన్యూస్ కాంటూర్ ట్రెంచెస్, పెర్కొలేషన్ ట్యాంకులు, బరాజ్‌లు నిర్మించడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసి, భూగర్భ జలాలను పెంచాలని సూచించారు. ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాల్లో విజయవంతంగా అమలు చేసిన అనుభవం ఉందని తెలిపారు. బఫర్ జోన్ విషయంలో శాస్త్రీయ విధానం అనుసరించాలని, నది సహజ ప్రవాహ ప్రాంతంలో ఉన్న నిర్మాణాలు మాత్రమే తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. నది బెడ్‌లో ఉన్న పరిమిత ఆక్రమణలను రీహాబిలిటేషన్